క్లుప్తంగా

మోమిన్‌పేట ఎంపీడీఓగా విజయలక్ష్మి



మోమిన్‌పేట: మోమిన్‌పేట మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విజయలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఆమె దౌల్తాబాద్‌లో పని చేసిన ఆమె మోమిన్‌పేటకు బదిలీపై వచ్చారు. మోమిన్‌పేటలో విధులు నిర్వహించిన శైలజారెడ్డి గత ఆరు నెలల క్రితం మహేశ్వరం ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఎంపీఓ యాదగిరి ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహించారు.

ధర్నాను జయప్రదం చేయండి

టిగ్లా జిల్లా అధ్యక్షుడు మహేందర్

తాండూరుటౌన్ : సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటి స్తూ తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ సంఘం (టిగ్లా) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని టిగ్లా జిల్లా అధ్యక్షుడు మహేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా లెక్చరర్లు పెద్ద ఎత్తున తరలి వచ్చి ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆ కార్యదర్శి మాకొద్దు



డీపీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కుల్కచర్ల: గ్రామాభివృద్ధికి కృషి చేయాల్సిన పంచాయతీ కార్యదర్శి అప్పుడప్పుడు వస్తూ కాలక్షేపం చేసే వ్యక్తి తమకు వద్దని గోరిగడ్డతండా నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి డీపీఓ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవకాశవాద రాజకీయాలకు పాల్పడే వ్యక్తులను మారుమూల గిరిజన తండాలకు వేయడం వల్ల నూతనంగా జీపీలుగా మారిన తండాలు మరింత వెనుకబాటుకు గురయ్యే పరిస్థితి నెలకొందన్నారు. నిబద్ధతతో పని చేసే కార్యదర్శులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అంగూర్‌నాయక్, బాలాజీ, గణేష్, రమేష్, శ్రీనివాస్, నరేంద్ర పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

అనంతగిరి: పూడూర్ మండలంలో దళితులపై దాడులు చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు కేవీపీఎస్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతి పత్రం అందజేశారు. దాడులు చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసినా పోలీసులు ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్, మల్కయ్య, ప్రవీణ్, రాములు, జహంగీర్, నర్సింలు ఉన్నారు.

మోమిన్‌పేట సీఐగా నవీన్



ఎస్పీ నారాయణరెడ్డిని కలిసిన నవీన్‌కుమార్

మోమిన్‌పేట: మోమిన్‌పేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నవీన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన సీఐ ఆంజనేయులు ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారి చేశారు. ఇంతకుముందు సీఐ నవీన్‌కుమార్ సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో విధులు నిర్వహించారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే జిల్లా ఎస్పీ నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

తాండూరు: తాండూరు హిందూ ఉత్సవ కేంద్ర సమితి నూతన కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వరుస పండుగల నేపథ్యంలో సమితి నూతన కార్యవర్గం సేవలు అందుబాటులోకి వచ్చాయి. హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులుగా మున్సిపల్ చైర్‌పర్సన్‌స్వప్నపరిమళ్, గౌరవ అధ్యక్షుడిగా సందల్‌రాజుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా పటోళ్ల నర్సింహులు, కోశాధికారిగా తర్లపల్లిభాను, ఉపాధ్యక్షుడిగా రొంపల్లి సంతోష్‌కుమార్, రాము, రఘు, శ్రీకాంత్, కిరణ్, రాకేష్, అశిష్ అప్టికర్, ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా సంజయ్ దేశ్‌ముఖ్, వీరప్రసాద్, వెంకట్, ప్రసాద్, సందీప్‌రెడ్డి, రజకనర్సింహా, సురేష్ నాయక్, రాజేందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వెంకటేశం, రామకృష్ణ, పరమేశ్, కల్చరల్ సెక్రటరీలుగా మంతన్‌గౌడ్ అశోక్, దావులయ్య, ప్రచార కార్యదర్శులుగా నరేష్, అనిల్‌గౌడ్, మీడియా ప్రతినిధులుగా నరేష్‌వాల్మికి, కుమార్ వాల్మీకీ, లీగల్ అడ్వయిజరీలుగా రవికుమార్, గుండప్ప, ఆధ్యాత్మిక సలహాదారులుగా సిద్ధిలింగయ్య ఎన్నికయ్యారని సమితి ప్రతినిధులు పేర్కొన్నారు.

బషీరాబాద్ కాంగ్రెస్‌లో..

'పెట్రోల్ బంక్' మంటలు!

- నావంద్గీ పీఏసీఎస్ ఆధ్వర్యంలో వంపు నిర్మాణం
- ల్యాండ్ లీజు కోసం ఇద్దరు నేతల మధ్య పోటీ
- తనకు ఏడాది కిందటే అగ్రిమెంట్ చేశారని కోటప్ప వెల్లడి
- బాధితుడికి అండగా కాంగ్రెస్ సీనియర్ల ఆందోళన



సొసైటీ ఎదుట ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బషీరాబాద్: నావంద్గీ రైతు సహకార సంఘం కొత్తగా ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్ ల్యాండ్ లీజు అధికార కాంగ్రెస్‌లో మంటలు పుట్టిస్తుంది. పంపు నిర్మాణానికి తన భూమికి లీజు అగ్రిమెంట్ చేసి సొసైటీ వైస్ చైర్మన్‌కు ఎలా కేటాయిస్తారని, కాంగ్రెస్ నేత కోటప్ప, ఆ పార్టీ సీనియర్ నాయకులు పీఏసీఎస్ ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ వ్యవహారం అధికార పార్టీ మండల నాయకుల మధ్య మాటల యుద్ధానికి తెరతీసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. నావంద్గీ పీఏసీఎస్‌కు గతేడాది పెట్రోల్ బంకు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి లభించింది. దీంతో చైర్మన్ వెంకట్‌రామ్ రెడ్డి ఆధ్వర్యంలో తీర్మానం చేసి కొర్విచెడ్‌కు చెందిన కాంగ్రెస్ నేత కోటప్ప భూమిలో లీజు ఇవ్వడానికి అంగీకరించారు.

ఇందులో భాగంగా 225 గజాల భూమిని 2023లో సీఈఓ బందెప్ప పేరున లీజ్ డీడ్ చేసుకున్నారు. అనంతరం ల్యాండ్ సర్వే చేసి నెలకు రూ.10వేలు చెల్లించేలా 25 ఏళ్ల పాటు లీజుకు తీసుకుంటూ ఒప్పందం రాసుకున్నారు. అప్పటి నుంచి ల్యాండ్ ఆ సొసైటీ ఆధ్వర్యంలోనే ఉంది. ఏడాది గడిచినా కిరాయి చెల్లించలేదు. తీరా తన పేరున లీజు ఒప్పందం ఉన్నప్పటికీ సొసైటీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ భార్య, మాజీ ఎంపీపీ కరుణ పేరున ల్యాండ్ లీజ్ చేస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై తాను గత 15 రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని కోటప్ప ఆవేదన వ్యక్తం చేశారు. కోటప్పకు మద్దతుగా తెరవెనుక మాజీ ఎమ్మెల్యే నారాయణరావు కుటుంబం ఉండి నడిపిస్తోందని వైస్ చైర్మన్ వర్గం అనుమానిస్తుంది.

కోటప్పకు మద్దతుగా నేతల ఆందోళన

మరోవైపు శుక్రవారం కార్యాలయంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఉండగా సొసైటీ ఎదుట కోటప్పకు మద్దతుగా మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వడ్డే ఉల్లప్ప, మాజీ ఎంపీటీసీ వడ్డే శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ వడ్డే హన్మంతు, కొర్విచెడ్ గ్రామస్తులు చందర్, శివ, అంబణ్ణ, చిన్న ఉల్లప్ప, ఎల్లప్ప తదితరులు వారికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం కోటప్ప మాట్లాడుతూ.. అధికారులు చేసుకున్న ఒప్పందం ప్రకారం తనకు కేటాయించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరగకుంటే కోర్టుకు వెళ్తానని హెచ్చరించాడు.

అగ్రిమెంట్ చేసింది వాస్తవమే

సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్ కోసం కొర్విచెడ్ గ్రామానికి చెందిన కోటప్ప అనే రైతు నుంచి సర్వే నంబర్ 4/2 లో 1.27ఎకరాల భూమి 24 జూలై 2023న అగ్రిమెంట్ చేయడం జరిగింది. ఇండియన్ ఆయిల్ కంపెనీ అధికారులు ల్యాండ్ లీజు అగ్రిమెంట్ అడిగినందుకే చేసుకున్నాం. ఇప్పటికైతే వేరే వ్యక్తుల మీద రెండో అగ్రిమెంట్ కాలేదు.

– బందెప్ప, సొసైటీ సీఈఓ

బాలికల భద్రత.. షీటీం బాధ్యత

తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు: బాలికల భద్రతకు షీ టీం నిరంతరం పని చేస్తోందని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలికలకు షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. బాలికల, మహిళల రక్షణ కోసం షీటీం విద్యాసంస్థల వద్ద ఎప్పటికప్పుడు నిఘా పెడుతుందన్నారు. బాలికలు సోషల్ మీడియాలో వ్యక్తిగత విషయాలను షేర్ చేయొద్దని సూచించారు. కళాశాలకు వచ్చే సమయంలో ఎవరైన ఆకతాయిలు ప్రేమపేరుతో వేధిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. బాలికలను వేధించినట్లు తెలిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకొంటామన్నారు. బాలికలు, మహిళలకు రక్షణ కోసం 181 లేదా 100 టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేయాలన్నారు. బాలల అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. బాల్య వివాహాలు జరిగితే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మల్లినాథ్, లెక్చరర్లు, విద్యార్థులు తదితరులున్నారు.

మెరుగైన సేవలు అందిస్తాం

బీజేపీ నాయకుడు శేరిరాంరెడ్డి



సీఎస్సీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న శేరిరాంరెడ్డి

దోమ : కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్సీ)తో ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తామని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు శేరిరాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దొంగఎన్కేపల్లి గ్రామంలో సీఎస్సీ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శేరిరాంరెడ్డి మాట్లాడుతూ.. కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా సంక్షేమ పథకాలు, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక, విద్య, వ్యవసాయ సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలందరూ సీఎస్సీ సెంటర్లను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు కృష్ణారెడ్డి, కృష్ణయ్య, గోపాల్, ఆంజనేయులు, సంతోష్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, యాదవరెడ్డి, మల్లేశ్, మాధవరెడ్డి, మల్‌రెడ్డి, సైదులు, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

టీచర్లను నియమించండి

మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి



వినతిపత్రం అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

బంట్వారం: మండలంలోని రొంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో టీచర్లను నియమించాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రొంపల్లి పాఠశాలలో ఒక స్కూల్ అసిస్టెంట్, నలుగురు ఎస్‌జీటీ టీచర్లు పని చేసే వారని, ఇటీవల సతీశ్ అనే ఎస్‌ఏ మ్యాథ్స్ టీచర్ బదిలీపై వెళ్లారన్నారు. అలాగే మరో ఇద్దరు ఎస్‌జీటీ ఉపాధ్యాయులు కూడా ట్రాన్స్‌ఫర్ అయినప్పటికీ వీరి స్థానంలో ఖాళీలు చూపించక పోవడంతో రొంపల్లి స్కూల్‌కు కొత్తగా ఉపాధ్యాయులు రాలేదన్నారు. ఈ క్రమంలో ఇక్కడ చదివే 70 మందికి పైగా విద్యార్థులు చదువులో వెనుకబడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో ఖాళీలు చూపించక పోవడంతోనే కొత్తగా ఉపాధ్యాయులను నియమించలేదన్నారు. ఇప్పటికై నా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఎస్‌ఏ మ్యాథ్స్ టీచర్‌తో పాటు మరో ఇద్దరు ఎస్‌జీటీలను నియమించాలని విజ్ఞప్తి చేశారు.

గెస్ట్ లెక్చరర్ల ఎంపికలో అవకతవకలు

అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతగిరి: వికారాబాద్‌లోని డైట్ కళాశాలలో ఈ నెల 28న నిర్వహించిన అతిథి అధ్యాపకుల ఎంపికను రద్దు చేయాలని అంబేడ్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల మల్లేశం డిమాండ్ చేశారు. అతిథి అధ్యాపకుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, నిబంధనలకు విరుద్ధంగా, న్యాయ నిర్ణేతల పక్షపాత వైఖరి బంధుప్రీతితో జరిగిందని పేర్కొంటూ ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా విద్యాధికారి కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన డెమో అధారంగా ఈ ఎంపిక చేస్తున్నట్లు తెలిపిన డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రతిభను గుర్తించకుండా పక్షపాత వైఖరి అవలంభించారని ఆరోపించారు. ప్రతిభ గల అభ్యర్థులకు అన్యాయం చేస్తూ న్యాయనిర్ణేతలు వారి బంధువులకు ఇప్పించుకున్నారని ఆరోపించారు. ప్రిన్సిపాల్ న్యాయ నిర్ణేతలు చేపట్టిన ఎంపికను వెంటనే రద్దుచేసి తిరిగి ఎంపిక ప్రక్రియ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కె.సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్, తాండూరు డివిజన్ కార్యదర్శి జంగం వెంకటేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్ అన్నారు. గురువారం కురిసిన వర్షాలకు పట్టణ కేంద్రంలోని పలు మురుగు కాలువలు జామ్ కావడంతో శుక్రవారం వాటిని తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులున్నా వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికే పట్టణంలోని పలు కాలనీలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. పట్టణాన్ని జిల్లాలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్ : నియోజకవర్గంలో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సాక్షితో ఫోన్‌లో మాట్లాడారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు లక్ష రూపాయాల వరకు ఎలాంటి కండీషన్లు పెట్టకుండా అందరికీ రుణమాఫీ చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకున్నారని అన్నారు. ఒక కుటుంబంలో ఇద్దరికి మించి కుటుంబ సభ్యులకు లోన్ తీసుకుంటే వారికి రుణమాఫీ కాలేదన్నారు. వివిధ కారణాలు చూపి వేలాది మంది రైతులకు రుణమాఫీకి దూరం చేశారని విమర్శించారు.

పుస్తకాల పంపిణీ

పరిగి: శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి కవిత మాట్లాడుతూ.. మండలంలోని 58 పాఠశాలల్లోని విద్యార్థులకు ఈ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ పుస్తకాల ద్వారా విద్యార్థులకు బేసిక్స్ నేర్చుకునేందుకు చాలా సులువుగా ఉంటుందన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన అన్ని పాఠశాలలో మా ప్రతినిధులు విద్యార్థులకు అన్ని రకాల యాక్టివిటీ కార్యక్రమాలను చేపడుతామన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి

పూడూరు: గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీని పటిష్టం చేయాలంటే సభ్యత్వాలు తప్పనిసరి అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మన్నెగూడలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ఇంటింటికి చేరవేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రతి అభివృద్ధి పనుల్లో కేంద్రం వాటా ఉంటుందని చెప్పారు. మండలం నుంచి అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో సినిమా సెన్సార్‌బోర్డు మెంబర్ మల్లేశ్‌పటేల్, జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, జిల్లా నాయకులు రాంచంద్రయ్య, నర్సింహా, రాజు, వెంకటయ్య, శ్రీశైలం, మాణిక్యం, సుభాష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోధనలో మెలకువలు తప్పనిసరి



కాంప్లెక్స్ సమావేశంలో ఆర్పీలు

బొంరాస్‌పేట: విద్యాబోధన సాధారణంగా కాకుండా మెలకువలతో కూడిన బోధన తప్పనిసరి అని ఆర్పీలు పేర్కొన్నారు. మండలంలోని బొంరాస్‌పేట, చౌదర్‌పల్లి కాంప్లెక్స్ పరిధిలోని కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు మొదటి రోజు ఆర్పీలు శ్రీప్రియ, నవీన్‌కుమార్, జీవన్‌కుమార్ అవగాహన కల్పించారు. టీఎల్ఎం, మెలకువలు పాటించి బోధిస్తే విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ, సామర్థ్యాలు బయటికి వస్తాయన్నారు. కొందరి ఉపాధ్యాయులతో మాదిరి బోధనను చేయించారు. రెండు రోజుల పాటు జరిగే సమావేశాల్లో ఉపాధ్యాయులకు హరివిల్లు, మాస్ పరీక్షల తదితర అంశాలు వివరించారు. ఇందులో సీఆర్పీలు సోమ్లా, శంకరయ్య, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మీ సేవలు మరువలేనివి

ఎంఈఓ రాంరెడ్డి



ఉద్యోగినిని సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

దుద్యాల్: ప్రతి ఉద్యోగికి విరమణ సహజమని మండల ఎంఈఓ రాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉర్దూ మీడియం పాఠశాల హెచ్ఎం అజ్రానస్రీన్ పదవి విరమణ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థుల ప్రతిభను పెంపొందించేందుకు ఆమె చేసిన సేవలు మరువలేనివని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయరామారావ్, ఉపాధ్యాయులు అబ్దుల్ హక్, మాజీ సర్పంచ్ ఖాజా, గ్రామస్తులు డాక్టర్ రఫీక్, హఫీజ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గోవిందమ్మ తదితరులు ఉన్నారు.

లగచెర్లలో 'గోబ్యాక్ ఫార్మా' ఫ్లెక్సీలు

పచ్చని పొలాల్లో ఫార్మా విషమంటూ రాతలు



పంచాయతీ కార్యాలయానికి కట్టిన ఫ్లెక్సీ

దుద్యాల్: మండల పరధిలోని లగచెర్లలో గోబ్యాక్ ఫార్మా అంటూ ఫ్లెక్సీలు వెలిశాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఫార్మా బాధితులు మాట్లాడుతూ.. లగచెర్ల, హకీంపేట, పోలేపల్లి, రోటి బండతండా, పులిచెర్లతండా, లగచెర్ల తండాలకు చెందిన రైతుల భూముల్లో ఫార్మా కంపెనీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేయడంతో రైతులు ఆందోళనలు, రాస్తారోకోలు, ధర్నాలు చేస్తున్నారు. పేదల భూములపై ప్రభుత్వం కన్నేసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తూ నిరసన తెలుపుతున్నామని బీఆర్ఎస్ దుద్యాల్ మండల యూత్ అధ్యక్షుడు బోగమోని సురేశ్ స్పష్టంచేశారు. ఫ్లెక్సీల ఏర్పాటు విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఫ్లెక్సీ కట్టడంపై స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మేమే కట్టామని చెప్పడంతో వెళ్లిపోయారు. ఫార్మా కంపెనీ ఏర్పాటును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ప్రాణం పోయినా సరే ఫార్మాకు భూములు ఇచ్చేది లేదని నినదించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫార్మా నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

బియ్యాన్ని పాఠశాలలకు చేర్చాలి

ప్రధానోపాధ్యాయుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న హెచ్ఎంలు

బొంరాస్‌పేట: 'మధ్యాహ్నం భోజన పథకం' నిర్వహణకు అందించే బియ్యాన్ని పాఠశాలలకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని శుక్రవారం మండల ఇన్‌చార్జి హెచ్ఎం రవీందర్‌కు ప్రధానోపాధ్యాయుల వినతిపత్రం అందజేశారు. మండలంలోని బొంరాస్‌పేట కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు బియ్యం చేరడం లేదని, కొడంగల్ స్టాక్ పాయింట్ నుంచి మండల కేంద్రానికి చేరుతుందని తెలిపారు. బొంరాస్‌పేట ఉన్నత పాఠశాల నుంచి అన్ని పాఠశాలలకు బియ్యం తీసుకువెళ్లేందుకు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. ఇందులో ఆయా పాఠశాలల హెచ్ఎంలు గౌరారం గోపాల్, రాధిక తదితరులున్నారు.

నీటి సమస్య పరిష్కారంపై హర్షం



మోటారు బిగించి నీటిని వదులుతున్న దృశ్యం

ధారూరు: మండలంలోని పీసీఎంతండాలో తాగు నీటి సమస్యను తీర్చేందుకు ఇటీవల స్పీకర్ ప్రసాద్ కుమార్ బోరు వేయించారు. శుక్రవారం బోరుకు మోటారు బిగించి స్టాటర్ ఏర్పాటు చేయడంతో తాగునీటి సమస్య తీరిందని తండానాయకులు హర్షం వ్యక్తం చేశారు. తరుచూ మిషన్ భగీరథ సరఫరాలో అంతరాయం కలగడం, నీటి కోసం ఇబ్బందులు పడటం షరా మామూలుగా మారింది. కొత్త బోరు ఏర్పాటుతో ఇక్కట్లు తీరాయని తండావాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గిరిజనులు స్పీకర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

అర్హులైన రైతులకు రుణమాఫీ



పుట్టపహాడ్‌లో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కుల్కచర్ల: అర్హులైన రైతులకు రుణమాఫీ వర్తిస్తుందని మండల వ్యవసాయ అధికారి వీరస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని పుట్టపహడ్ పంచాయతీ కార్యాలయంలో రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ.. వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించి వారికి మాఫీ వర్తింపజేసేందుకు గ్రామగ్రామాన సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నిబంధనల అనుసరించి సర్వే చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నిఖిత స్థానిక జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతుల కోసమే..



మర్పల్లి: వివరాలు నమోదు చేస్తున్న ఏఓ, ఏఈఓ

మర్పల్లి: రుణమాఫీ కాని రైతుల కోసం కుటుంబం సభ్యుల నిర్ధారణ కార్యక్రమం చేపడుతున్నామని మర్పల్లి ఏఓ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మండలంలోని పట్లూర్ క్లస్టర్ రైతు వేదికలో రుణమాఫీ కాని 80 మంది రైతు కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు ఏఓ తెలిపారు. రైతులు ఆందోళన చెందొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ మహేశ్, నీరజ, ప్రశాంత్ రైతులు ఉన్నారు.

తప్పులుంటే మాఫీ కాదు..

ధారూరు: బ్యాంకులు, సొసైటీలు ప్రభుత్వానికి సమర్పించిన వివరాల్లో ఏదో ఒక తప్పు ఉండటం వల్ల రుణమాఫీ కావడంలో జాప్యం జరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు వివరించారు. మండలంలోని అవుసుపల్లి, కుక్కింద, నర్సాపూర్ గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారి సంజూరాథోడ్ పర్యటించి రుణమాఫీ కాని, రైతుల నుంచి పూర్తి వివరాలు సేకరించారు. సేకరించిన వివరాలతో పాటు రైతు కుటుంబంతో సెల్ఫీ తీసుకుని గ్రూప్‌లో యాడ్ చేశారు. మాఫీ కాని రైతులు ఆందోళన చెందొద్దని సూచించారు.

మండపాల ఏర్పాటు షురూ



వినాయక చౌక్ వద్ద జోరుగా మండపం పనులు

తాండూరు: గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు పట్టణంలో మండపాలు సిద్ధమవుతున్నాయి. తాండూరు పట్టణంలోని వినాయక చౌక్ వద్ద ప్రతిష్ఠించే వినాయక విగ్రహానికి మండపాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు రూ.లక్షలు వెచ్చించి నిర్మిస్తున్నారు. పట్టణంలో ప్రతి ఏటా దాదాపు 270 గణేష్ మండపాలు ఏర్పాటు చేసి పూజలు చేస్తారు. 5 రోజుల పాటు పూజలు చేసి తర్వాత కాగ్నానదిలో నిమజ్జనం చేస్తారు. ఈ ఉత్సవాలను తాండూరు హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించనున్నారు.